# పర్మనెంట్ లవ్

## – మల్లి భానుమూర్తి

## యూనివర్శిటీ!


### ఆర్ట్సు కాలేజ్ బిల్డింగ్!

### అది సెకండ్ ఫ్లోర్... ఇది ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్. ఇది ఫస్టియర్ క్లాస్ రూం!

క్లాసంతా నిశ్శబ్దంగా వుంది. నిశ్శబ్దంగా వుందంటే ఖాళీగా వుండాలి. చిత్రంగా క్లాస్ రూం నిండుగా వుంది. నిండుగా వున్న క్లాస్ రూం నిశ్శబ్దంగా వుండడం విచిత్రం అయితే, ఆ విచిత్రానికి కారణం అది ప్రొఫెసర్ శాంతగారి క్లాస్ కావడం...

అందరి చూపులు డోర్ మీదే! ... అందరి చెవులు వరండా ప్రతిధ్వనించే శాంత మేడం నడకల లయల మీదే!!

ఫస్టియర్ క్లాసెస్ ప్రారంభమై మూడు రోజులయింది. ఈ మూడు రోజులుగా ఆమె క్లాసు తీసుకుంటోంది.



మొదటి రోజే ప్రొఫెసర్ శాంతను చూసి క్లాస్ మొత్తం నోరు వెళ్ళబెట్టారు. రెండవ రోజు తల తిప్పకుండా చూశారు. మూడవ రోజు రెప్ప వేయకుండా చూశారు. నాలుగవ రోజు ఊపిరి బిగబెట్టి చూస్తున్నారు ఆమె రాక కోసం... ఆమె దర్శనం కోసం. విద్యార్థులలో ఇంత సంచలనానికి కారణం ప్రొఫెసర్ శాంత అసాధారణమైన అందం. ప్రొఫెసర్ శాంత విలక్షణమైన సౌందర్యవతి.

ఆమె అందం వర్ణనాతీతం... ఏ కోణంలోంచి చూసినా చూపును కట్టెయ్యగల అందం... మనస్సును స్పందింపజేసే సౌందర్యం...

శారీరక సౌందర్యానికి తోడు పరిణతి చెందిన మేధ ఆపాదించిన మానసిక ఔన్నత్యం ఆమెను మరింత గొప్పగా ప్రకాశింపజేస్తుంది.

ప్రొఫెసర్ శాంత ఆ ఫస్టియర్ విద్యార్థులకి కొత్త కావచ్చుగాని ఆమెకు ఇలాంటి కుర్రాళ్ళు - విద్యార్థినులు కూడా చాలా సాధారణ విషయం.

అందుకే ఆమెలో ఎప్పుడూ ఒకే నిండుతనం... ఆహ్లాదకరమైన గాంభీర్యం!

గుమ్మంలో ప్రొఫెసర్ శాంత!

అటే చూస్తూ పిల్లలు అంతా లేచి నిలబడ్డారు... మౌనంగా.

"గుడ్ మోర్నింగ్..."

చిరునవ్వుకు బుగ్గలు సొట్టలు పడగా పెదవులపై కాంతిరేఖ మెరిసి మాయమైంది. ఓ సారి కళ్ళజోడు సర్దుకొని కూర్చుంది శాంత...

అలవోకగా చెయ్యి పైట మీదకు వెళ్ళి తిరిగి టేబుల్‌పై అటెండెన్స్ రిజిస్టర్‌ను తెరచింది.

రెప్పలెత్తి చూసిందామె. అందరి చూపులు తన మీదే... ఓసారి రెప్పలు కదిపి ఒక్కొక్క పేరు పిలవసాగింది.

ఆమె నోటితో తమ పేరు వినడం ఎవరికి వారికి ఎంతో థ్రిల్లింగ్‌గా వుంది.

"ఎస్...మాడం"

"ప్రెజెంట్ మాడం..." అంటూ అటెండెన్స్ పలకసాగారు.

"మిస్టర్ జి... జగన్ మోహన్‌రావ్..."

జవాబు లేదు.

తిరిగి పిలిచింది.

జవాబు లేదు.

తలెత్తి చూసింది... వచ్చాడా, రాలేదా అన్నట్లు.

క్లాసులో అంతా తల తిప్పి ఓ అబ్బాయి వంక చూశారు విచిత్రంగా; 'వచ్చే అటెండెన్స్ పలకడేం?' అన్నట్లు.

అయితే జగన్ అటే... శాంతవేపే

చూస్తున్నాడు. అతని ముఖం అద్భుతానందాన్ని ప్రతిఫలిస్తోంది. అలౌకికంగా స్వప్నాలలోలేనట్లు తదేకంగా రెప్పవెయ్యకుండా, కనుగుడ్డు కదపకుండా ఊపిరి బిగబెట్టి శాంతనే చూస్తున్నాడు.

అతని పేరే జగన్‌మోహన్‌రావ్ అని శాంత గుర్తించింది. కనుబొమలు ముడిచి చిరాగ్గా చూసింది.

"మిస్టర్ జి. జగన్‌మోహన్‌రావ్" కొంచెం గొంతు పెంచి పిలిచింది.

జగన్ ఉలిక్కిపడ్డాడు... తుళ్ళిపడ్డాడు... తత్తరపడ్డాడు... కాని సిగ్గుపడలేదు.

"ఎస్ మాడం" అన్నాడు చురుగ్గా...

అందరూ జగన్‌ను గమ్మత్తుగా చూశారు.

శాంత కూడా ఆశ్చర్యంగా చూసింది. తనను చూసి మైమరచిపోయే కుర్రాళ్ళు తెలుసుగాని మరీ ఇంతగా ట్రాన్స్‌లోకి పోయినట్లు ఎవ్వరూ ప్రవర్తించలేదు. చటుక్కున ఆలోచన ఆపి అటెండెన్స్ పిలవసాగింది. ఆ తర్వాత పాఠం చెబుతూ జగన్ వైపు చూడకుండా వుండలేకపోయిందామె.

జగన్ లెక్చర్ వినడం లేదు... పరధ్యానంగా లేదు... ఏదో ఆలోచించడం లేదు... ఎటో చూడడం లేదు, సర్వేంద్రియాలు కేంద్రీకరించి శాంతను చూస్తున్నాడు... అంతే—

తొలిసారి... ఓ స్టూడెంట్ ఉనికి శాంతకి కొంత ఇబ్బంది కలిగించింది. పుట్టినప్పుడే తుషారబిందువులా వున్న శాంతకు ఆమె అందం, గొప్పదనం మంత్రసాని దగ్గర నుంచి ప్రతి ఒక్కరూ చెబుతూనే వున్నారు. అయితే వయస్సు వచ్చాక అందం కలిగించే సమస్యలు ఆమెకు అనుభవం కాసాగాయి. పుట్టిన పిల్లాడి మొదలు వందేళ్ళ



వృద్ధులవరకూ మగాళ్ళేకాదు స్త్రీలు కూడా ఆమె వైపు చూసి తల తిప్పుకోలేకపోయేవారు.

మంచి కుటుంబంలో పుట్టిన శాంత స్వతహాగా తెలివైన అమ్మాయి కావడంతో భవిష్యత్తును ఊహించుకోగలిగింది. సమాజాన్ని 'ఫేస్' చెయ్యడానికి వీలయినంత సింపుల్‌గా వుండసాగింది. దాంతో వెంటపడే కుర్రాళ్ళకి ఆమె మంచి రిప్లై వుండేది కాదు. ఎలా ప్రవర్తించినా చిరునవ్వుతో తలొంచుకొని వెళ్ళిపోయేది. వెంటపడే అబ్బాయిలకి తర్వాత ఏం చెయ్యాలో తోచేది కాదు.

దాంతో అందరి పరిస్థితి శాంత విషయంలో కేవలం నోరు వెళ్ళబెట్టి చూడడమే! ఆశయాలు, ఆశలు స్పష్టంగా ఏర్పడ్డాక ఆమెను బాహ్య ప్రపంచం ఏమీ చెయ్యలేకపోయింది. రామకృష్ణతో పెళ్ళి, ప్రశాంతమైన సంసార జీవనం, లెక్చరర్ ఉద్యోగం, రీసెర్చి, డాక్టరేట్, ఇద్దరు పిల్లలు, ముప్పైఅయిదేళ్ళ వయస్సు చాలా కాజువల్‌గా ఆమెను హత్తుకొన్నాయి.

ప్రొఫెసర్ శాంతగా ఆమెను యూనివర్సిటీ గౌరవిస్తోంది. ఆ గౌరవం వెనకనే ఆమె అందం పట్ల ఆరాధన నుంచింది. అందం ఎప్పుడూ 'సెకండరీ'గా వుంచి ప్రతిభనే గౌరవించేలా ప్రవర్తించడం శాంత క్రియేట్ చేసింది. ఆమె మృదువైన ప్రవర్తన, ఎవ్వరినీ అతిగా అభిమానించకపోవడం, అతిగా శత్రుత్వాన్ని ప్రదర్శించకపోవడం ఆమెను రక్షిస్తున్నాయి. ఎవరైనా ఆమె అందాన్ని అభినందించబోతే నవ్వేసి టాపిక్ మార్చేస్తుంది. ఇదంతా చరిత్ర అయితే ఇప్పుడు జగన్ ఓ చరిత్ర సృష్టించాడు.

ఆ రోజంతా జగన్ చూపు శాంతను వెన్నాడింది. అంతేకాదు ఆ రోజంతా స్టూడెంట్స్ శాంతను చూసి ముసిముసిగా నవ్వుతూ చెవులు కొరుక్కోసాగారు. అప్పుడే ఫేకల్టీకి కూడా తెలిసినట్టు వుంది. అంతా గమ్మత్తుగా చూడసాగారు.

ముప్పైఅయిదేళ్ళుగా ఏ అంశం అయితే చర్చించబడకుండా కాపాడుకుందో ఆ అంశం ఒక్క రోజులో చర్చనీయాంశమైంది.

శాంతకు ఈ విషయం మర్నాడు ఉదయం కాలేజీకి రాగానే అవగతమైంది. పదేళ్ళుగా ఎన్నడూ చర్చకురాని సమస్య ఇప్పుడామెను కలవరపెట్టింది.

'జగన్ చెలరేగకుండా చూడాల' అనుకుంది క్లాస్‌కు వెళుతూ.

అయితే విచిత్రంగా 'జగన్' ఎప్పటిలా మామూలు స్టూడెంట్‌లా కనిపించాడు.

పిలవగానే అటెండెన్స్ పలికి ఏదో పుస్తకం చూసుకోసాగాడు.

శాంతేకాదు, క్లాసంతా ఆశ్చర్యపోయింది. జగన్ గుడ్లప్పగించి చూసే కార్యక్రమం ముదిరితే మర్నాడు యూనివర్సిటీ గోడల నిండా రాయాలని ఉబలాటపడ్డ స్టూడెంట్స్ అందరికీ గొప్ప నిరాశ కలిగింది.

శాంత తేలికగా ఊపిరి పీల్చుకుంది.

క్లాస్ ఎప్పటిలా మామూలుగా జరిగిపోయింది.

తన రూంకి తిరిగొచ్చి బుక్స్ టేబుల్‌పై పెట్టి

కళ్ళజోడు తుడిచిపెట్టుకొని కుర్చీలో విశ్రాంతిగా కూర్చుంది.

అప్పుడు చూసింది టేబుల్‌పై బుక్‌లో ఓ మడిచిన కాగితం!

చురుగ్గా కదిలి కాగితం అందుకొని మడత విప్పి చూసింది.

"మేడం!... ఐ లవ్ యూ..."

జగన్!

సంతకం లేదుగాని వెంటనే అర్థమైంది జగన్ రాశాడని... చివ్వున లేచింది. స్ప్రింగ్ డోర్ లాగి బయటకొచ్చింది.

అవతలగా స్తంభాన్ని ఆనుకొని నిలబడి వున్నాడు జగన్. చిలిపిగా, కొంటెగా, అల్లరిగా చూడడం లేదు. బేలగా, దిగులుగా, భయం భయంగా చూస్తున్నాడు.

శాంత చివ్వున లోపలికి వచ్చింది.

'నలుగురిలో అసభ్యంగా చూడకుండా వుంటే హమ్మయ్య అనుకుందిగాని ఇలా మరో అడుగు ముందుకు వేస్తాడనుకోలేదు. ఈ ధోరణి, ఆ చూపు చూస్తోంటే పిచ్చి ముదిరేలా వుంది. ఈ కుర్రాడికి ఇక్కడే బుద్ధి చెప్పాలి. ఈ ళెటర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ సోమయాజులుగారికిస్తే తిక్క కుదురుతుంది...' అనుకుని లేచి విసవిసా బయటకొచ్చింది. జగన్ వున్న వైపు చూడలేదుకాని, అక్కడే వున్నాడని గుర్తించింది.

మరో నాలుగడుగులు వేసి టక్కున ఆగిపోయింది. కారణం సోమయాజులు వక్రబుద్ధి... చొంగ నోరు... కుటిల నవ్వు... దొంగ ముఖం గుర్తురావడం.

'వీడు ఈ విషయాన్ని పెద్దది చేస్తాడు... పబ్లిసిటీ ఇస్తాడు...'

అడుగు ముందుకు పడలేదు శాంతకు. ఓ క్షణం అలా నిలబడి వెనుతిరిగి జగన్ వైపు చూస్తూ కాగితం ముక్కలుగా చించి గిరాటేసి విసవిసా లోపలికి వెళ్ళిపోయింది. అక్కడే శాంత పెద్ద తప్పు చేసింది.

హెడ్‌కి కంప్లెయింట్ చెయ్యకపోవడం జగన్‌ను మరింత ప్రోత్సహించినట్టయింది. రోజూ శాంత టేబుల్‌పై ఓ గులాబి పువ్వు వుంచేవాడు. ఏదో ఓ టైంలో ఆమె బుక్స్‌లో 'ఐ లవ్ యూ మేడం' అని రాసిన పేపర్ పెట్టేసేవాడు. అవర్స్ లేనప్పుడు ఎప్పుడూ ఆమె రూమ్ ముందే పడిగాపులు పడి వుండేవాడు. ఎప్పుడూ అదే చూపు, ఆరాధనగా, భక్తిగా... పిచ్చిగా.

క్లాస్ రూంలో మాత్రం అప్పలు చూసేవాడు కాదు. కాలేజి, యూనివర్సిటీలో ఎవ్వరికీ ఈ విషయం తెలియదు. కాని ప్రతి క్షణం శాంతను వెంటాడసాగాడు జగన్. ఓ రోజు రూమ్‌లోంచి బయటికొచ్చింది... ఎదురుగా వరండా గోడ మీద "ఐ లవ్ యూ..." అదే రాత... కాని సంబోధనగాని, సంతకం గాని లేవు... మర్నాడు ఆర్ట్స్ కాలేజ్ ఎంట్రెన్స్ గోడ మీద "ఐ లవ్ యూ..." డిపార్ట్‌మెంట్ లైబ్రరీలో "ఐ లవ్ యూ..." కనిపించి కనిపించకుండా... కేవలం శాంతే గుర్తించేలా రాస్తున్నాడు.

రాను రాను జగన్ ప్రేమ శాంత భరించలేనట్టు తయారైంది. ప్రతి క్షణం అతనే గుర్తురాసాగాడు. కాలేజ్, క్లాసు అనేసరికి వణుకు వస్తోంది...

ఓ రోజు ఉదయాన్నే లేచి బ్రష్ నోట్లో పెట్టుకుని బయటికొచ్చింది. ఎదురుగా రోడ్డు అవతల గోడ నానుకుని 'జగన్!'

ఉల్కిపడింది. అలాగే చూస్తున్నాడు ఆరాధనగా...

లోనకెళ్ళిపోయింది. ఓ గంట తర్వాత కిటికీలోంచి చూస్తే ఎదురుగా గోడంతా "ఐ లవ్ యూ..."

ఆ రోజు లైబ్రరీకి వెళ్ళింది శాంత... పీరియాడికల్స్ సెక్షన్‌లో 'సాటర్‌డే ఈవెనింగ్ పోస్ట్' పాత సంచికలు తిరగేస్తోంటే ఎవరో చూస్తున్నట్లు అనిపించి తల తిప్పి చూసింది. అవతల షెల్ఫ్ లోంచి 'జగన్'.

ఓ క్షణం ఆలోచించి అతనికి దగ్గరగా వెళ్ళింది.

నిజమా, కలా అన్నట్టు,




# సెక్సు-బ్లడ్ ప్రెజర్

సృష్టికార్యంలో పాల్గొన్నప్పుడు మీ భాగస్వామి ఎక్కువ సార్లు ఊపిరి పీల్చడం మీరు గమనించి వుంటారు. గుండె కూడా ఎక్కువసార్లు స్పందిస్తుంది. అయితే రక్తపోటు స్త్రీ-పురుషులలో ఒకే విధంగా వుంటుందా? లైంగిక తృప్తికి రక్తపోటుకి ఏమైనా సంబంధమున్నదా? సృష్టి కార్యంలో పాల్గొన్నప్పుడు రక్తపోటుని తెలుసుకోవడం సాధ్యమా?

— వచ్చే సంచికలో చూడండి —

మాస్తున్నాడు జగన్. లైబ్రరీలో ఫాన్స్ తిరుగుతున్న శబ్దం, పేజీలు కదులుతున్న శబ్దం తప్ప అంతా అదోలాంటి నిశ్శబ్దం.

"మిస్టర్ జగన్... నీతో కొంచెం..."

"ఏం మాట్లాడతారో నాకు తెలుసు మేడం... 'నీ కంటే పెద్ద దాన్ని బాబూ' అంటారు. 'ఇలా, నాతో ప్రవర్తించడం తప్పు' అంటారు. 'నాకు నీ వయస్సున్న కొడుకున్నాడు' అంటారు. 'నీ పిచ్చి మానుకో' అంటారు... అవునా?"

నివ్వెరపడినట్టు నిలబడింది శాంత... అతను కరెక్ట్‌గా ఊహించాడు.

"బట్ ఐ యాం సారీ మేడం ... ఐ లవ్ యూ... ఐ ఎడోర్ యూ... ఐ...ఐ..."

"ఓ.కె. జగన్. అయితే నన్నేం చెయ్యమంటావ్?" అసహనంగా అడిగింది శాంత.

నవ్వి జేబులోంచి ఓ కవర్ తీసి ఇచ్చాడు - "ఇది చదవండి...బై..." చురుగ్గా వెళ్ళిపోయాడు.

ఓ క్షణం అలా వుండిపోయింది శాంత...

ఒళ్ళంతా చెమట పట్టింది.

'ఏం రాసి వుంటాడు?' ఆమె మనస్సు పరిపరి విధాల ఆలోచిస్తోంది. టెన్షన్‌తో అక్కడే ఓ మూల టేబుల్ దగ్గర కూర్చుండిపోయి కవర్ విప్పింది.

ప్రొఫెసర్ శాంత!

ఐ లవ్ యూ ... ఐ లవ్ యూ... ఇలా అనడం నా కెంతో ఆనందంగా వుంది. మీరు నాతో అలా అనాలని నా కోరిక... 'ఈ మాత్రమేనా... అనేస్తాను' అనుకోకండి. ఊరికే 'ఐ లవ్ యూ జగన్' అంటే చాలదు. ఆ మాట ఎంతో మధురంగా పలకాలి. నన్ను ముద్దు పెట్టు కోవాలి. కేవలం ముద్దేగా అనుకోకండి మేడం ... చాలా మధురంగా ముద్దు పెట్టుకోవాలి. నాతో కలిసి బీచ్‌లో నడవాలి. కేవలం కలిసి నడవడమేగా అనుకోకండి. నా నడుం చుట్టూ చెయ్యి వేసి ప్రేమగా కలిసి నడవాలి. ఆ తర్వాత మనిద్దరం కలిసి డిన్నర్ తీసుకోవాలి. నా ప్రేమను, నా ఆరాధనను స్వీకరించాలి... నన్ను నా ప్రేమను నిజంగా గుర్తించాలి. అప్పుడు ముద్దు పెట్టుకోవాలి. చాలు మేడం... అంతే... అంతకంటే ఇంకేమీ కోరను. ఆ తర్వాత మిమ్మల్ని ఇబ్బంది పెట్టను. నా కోర్కె తీరుస్తారని ఆశిస్తున్నాను. ఇదేదో పిల్ల చేష్టలు అని ఊరుకుంటే నేనూరుకోను. నా పంతం మూశారుగా. అది శాంపిల్ మాత్రమే. తర్వాత మనిద్దరి పేర్లు గోడలకెక్కిస్తా... మన ప్రేమ యూనివర్శిటీ అంతా టాంటాం చేస్తా... తర్వాత ఉరిపోసుకుంటా. నా సీరియస్‌నెస్ మీకు తెలుసని నాకు తెలుసు. ఎల్లుండి అంటే బుధవారం మీరు నా ప్రేమను స్వీకరించే రోజు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు మనం రామకృష్ణా బీచ్‌లో ఐస్ పార్లర్ దగ్గర కలుసుకుంటాం... బై...బై... థాంక్యూ...

మీ ఆరాధకుడు జగన్

ఉత్తరం చదివి స్తబ్దుగా కూర్చుండిపోయింది శాంత. ఆమె బుర్ర మొద్దుబారిపోయింది. బీచ్‌కి వెళ్ళాలా... వద్దా?

మెదడంతా తొలిచేస్తోందా ప్రశ్న మరొకరికి చెప్పుకునే విషయం కాదు. కాని ఆ రాత్రి భర్తతో చెప్పింది. వీలయినంత కాజువల్‌గా చెప్పింది.

"ఏమండోయ్... నాకో కుర్రాడు లవ్ లెటర్ రాశాడు..." అతని ప్రతిస్పందన కోసం ఊపిరి బిగబెట్టి చూసింది.

బోర్లాపడుకున్న రామకృష్ణ పక్కన తిరిగి శాంతను మీదకు లాక్కున్నాడు.

"ఇంత కాలానికి మా ఆవిడ అందం మీద నాకు నమ్మకం కుదిరిందోయ్"

## అభినవ ధర్మరాజు




కలకత్తా సమీపంలోని రోహతాస్‌కు చెందిన దీన బ్రహ్మ అనే వ్యక్తి ఈ మధ్య ఒక జాతరలో జూదమాడి డబ్బంతా పోగొట్టుకుని, చివరకు పందెంలో తన భార్యనే పణంగా పెట్టాడు. ఆ పోటీల్లో అతను ఓడి పోవడంతో గెలిచిన వ్యక్తి అతని భార్యను తీసుకు పోవడానికి ప్రయత్నించాడట. ఆమె ప్రతిఘటించడంతో అక్కడున్న వారంతా చేరి ఆమె భర్తను చివాట్లు పెట్టారు. చందాలు వేసుకుని డబ్బు పోగుచేసి ఇచ్చి ఆమెను విడిపించారు. జూదంలో భార్యను పందెం కాసే భర్తలు మహాభారత కాలంలోనే కాక ఇప్పుడూ వున్నారని నిరూపించాడు ఈ అభినవ ధర్మరాజు.

-జి.ఆర్

అతను చుట్టుముట్టెయ్యడంతో ఏమీ అనలేకపోయింది.

ఆ మర్నాడంతా ఇదే ఆలోచన-

బుధవారం సాయంత్రం మూడు గంటలకే బయల్దేరి కారులో బీచ్‌కి ఎదురుగా వున్న "సీ పెర్ల్" రెస్టారెంట్‌కి వెళ్ళింది. ఫస్ట్ ఫ్లోర్‌లో కార్నర్ టేబుల్ దగ్గర కూర్చుంటే ఎదురుగుండా బీచ్‌లో ఐస్‌క్రీం పార్లర్ స్పష్టంగా కనిపిస్తుంది. అక్కడ కూర్చుని తీక్షణంగా చూడసాగింది శాంత.

మూడున్నర... నాలుగు...

జగన్ రాలేదు.

నాలుగున్నర...అయిదు...అయిదున్నర... ఆరు... ఆరున్నర... చీకటి బాగా ముసిరింది. జగన్ జాడ లేదు.

శాంతకు ఆశ్చర్యం పెరిగిపోయింది. ఎందుకు రాలేదు జగన్?! జవాబు ఊహకందలేదు. ఆ తర్వాత రోజు క్లాసులో కూడా లేదు. కాలేజీకి రాలేదు. ఆ రోజు కాస్త తేలికగా ఊపిరి పీల్చుకుంది శాంత.

ఆ తర్వాత రోజు వచ్చాడు - క్లాసులో కనిపించాడు. అతన్ని చూసి ఆశ్చర్యపోయింది శాంత. ఏటో చూస్తూ తనలో తానే నవ్వుకుంటున్నాడు. ఆమెకు భయం వేసింది పిచ్చెక్కిందేమోనని. ఆ రోజు అసలు శాంత రూమ్ వైపు కూడా రాలేదు. ఆ మర్నాడు... ఆ తర్వాతి రోజు... అసలు శాంత వైపు కన్నెత్తి చూడడం లేదు. క్లాసులో కనిపిస్తున్నాడు. క్లాస్ కాగానే హడావిడిగా వెళ్ళిపోతున్నాడు మంచి విద్యార్థిలా.

ఇప్పుడు శాంతే జగన్ వంక తేరిపార చూస్తోంది.

ఎందుకిలా మారిపోయాడో ఆమెకు అర్థంకావడం లేదు.

మరోవారం తర్వాత బందరు నుంచి రామకృష్ణ స్నేహితుడు చంద్రశేఖర్‌రావు వచ్చాడు ఇంటికి... ఆయన కూతురు లలిత హాస్టల్లో వుండి బయాలజీ చేస్తోంది. లలిత మంచిపెద్దలు రామకృష్ణ, శాంత చూస్తుంటారు. లలిత కూడా వచ్చింది. పిచ్చాపాటి కబురులయ్యాక అసలు విషయం చెప్పాడు చంద్రశేఖర్‌రావు.

"ఈ రోజుల్లో ఆడపిల్లలు మరీ దూకుడుగా వుంటున్నార్రా రామకృష్ణా! ఇది చూశావా... మన లలిత... ఓ అబ్బాయికి ప్రేమ లేఖ రాసిందట. ఆడపిల్లే రాసేసరికి ఏ కుర్రాడు మాత్రం ఎగిరి గెంతెయ్యకుండా వుంటాడు!? వాడు ఎగిరి గంతేశాడు. ఆ అబ్బాయి వివరాలు తెలుసుకొని నాకు రాసింది పెంకిపిల్ల. నేను వెంటనే వెళ్ళి అతని పెద్దలతో అన్నీ మాట్లాడాను. అంతా శుభంగానే వుంది... కాని కుర్రాడి గుణగణాలేమిటో..." చెప్పాల్సిందంతా చెప్పి ఆపాడు. లలిత చిరాగ్గా చూసింది తండ్రివంక.

రామకృష్ణ నవ్వి "లలితే ప్రేమించి వెంటపడిందంటే మంచి కుర్రాడే అయి వుంటాడ్రా!"

శాంత లలిత వంక చూసి కొంటెగా నవ్వి "నీకు అంతగా నచ్చిన కుర్రాడెవరే లలితా?" అంది.

లలిత లలితంగా నవ్వి సిగ్గుగా చెప్పింది "మీ డిపార్ట్‌మెంటే అంటే...జగన్..."

తుళ్ళిపడింది శాంత...

చంద్రశేఖర్‌రావు అన్నాడు — "కేవలం వారం రోజుల్లో ప్రేమించుకొని పెళ్ళికి హడావిడి పడిపోతున్నారు. ఆ కుర్రాడు ఎలాంటి వాడో?"

మనస్ఫూర్తిగా చెప్పింది శాంత "మంచి కుర్రాడు."

●

